క్లుప్తంగా

ఇళ్ల సర్వే పూర్తి చేయాలి

మానవపాడు: మండలంలోని 16 గ్రామాల పంచాయతీలకు సంబంధించి ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలని ఎంపీడీఓ భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు ముగ్గురు అధికారులు ఎంపీడీఓ భాస్కర్, మండల ప్రత్యేక అధికారి సక్రియా నాయక్, మండల వ్యసాయ అధికారి ప్రదీప్‌ల ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే మే 2 నాటికి పూర్తి చేయాలని ఉన్నతాధికారులు నుంచి ఆదేశాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

మానవపాడు: రోడ్డు నిబంధనలను వాహనదారులు, ప్రజలు తప్పక పాటించాలని ఎస్‌ఐ చంద్రకాంత్ సూచించారు.మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాదారులు సరైనా ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు గ్రామంలో వెలసిన రేణుక ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యుల నిర్వహణ లేమితో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు.

వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవాలు



మానవపాడు: మండలంలోని గోకులపాడు గ్రామంలో కాశీ నుంచి తెచ్చిన శివలింగం, విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మంగళవారం పండితులు శ్రీకాంత్‌వర్మ ఆధ్వర్యంలో పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, ఆచార్యాది ఋత్విక్ వరణం, మృత్ సంగ్రహణం, అంకురార్పణ చేశారు. బుధవారం ఉదయం ప్రాతఃకాలపూజ, దీక్షాహోమం, శాంతిహోమం, నవగ్రహవస్తు, సర్వతోభద్ర, మంగళహారతి, విగ్రహల ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా బుధవారం భజన పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, శివాంజనేయస్వామి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈదమ్మ ఉత్సవాలు



అలంపూర్: మండల పరిధిలోని క్యాతూర్ గ్రామంలో ఈదమ్మ అమ్మవారి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను పురస్కరించుకొని గ్రామ ప్రజలు ఊరేగింపుగా అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించారు. భారీగా తరలొచ్చిన భక్తులతో గ్రామ పుర వీధులు ఆధ్యాత్మికంగా మారాయి. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర పురుషుల కబడ్డీ పోటీల్లో దాదాపు 30 జట్లు పాల్గొనున్నాయి. వృషభాల బండలాగుడు పోటీలు, ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్టీసీ అధికారులు స్పెషల్ బస్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెక్కుల అందజేత

పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లిలో విద్యుత్ ప్రమాదంలో పశువులు మరణించిన యజమానులకు ప్రభుత్వం నుంచి మంజూరైన పరిహారం చెక్కులను మంగళవారం గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ భాస్కర్‌యాదవ్ అందజేశారు. ఆరు నెలల క్రితం గ్రామానికి చెందిన పికిలి చంద్రకళకు సంబంధించిన 6 గొర్రెలు చనిపోతే రూ.42 వేలు, ఎనుముల బాలయ్య గేదె చనిపోతే రూ.40 వేలు, జుట్టుకూరి కుర్మయ్య ఆవు చనిపోతే రూ.40 వేల పరిహారం చెక్కులను పశువుల యజమానులకు అందజేశారు.

చెక్‌డ్యాంల నిర్వహణ ఏది?

- శిథిలావస్థలో చెక్ డ్యాంలు
- మరమ్మతుకు నోచుకోని వైనం
- వాగుల్లో నీరు నిల్వని పరిస్థితి



అయిజ పెద్దవాగులో శిథిలమైన చెక్‌డ్యాం

అయిజ: వర్షపునీరు వృథాగా పోకుండా వాగులు, వంకల్లో నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచాలనే ఉద్దేశంతో 2001లో అప్పటి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వాగులు, వంకలు ఉన్న ప్రదేశాల్లో చెక్‌డ్యాంలు నిర్మించింది. జిల్లాల పునర్ విభజన అనంతరం జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలోకి మొత్తం 20 చెక్ డ్యాంలు ఉన్నాయి. జిల్లా పరిధిలో మొత్తం 7 చెక్ డ్యాంలు శిథిలమయ్యాయి. సైడ్‌వాల్స్ కొట్టుకుపోయాయి. ఇప్పటి వరకు వాటిని పునర్ నిర్మించలేదు. కనీసం మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు.

మండలాల వారీగా చెక్ డ్యాంలు..

అయిజ శివారులో మొత్తం 4 చెక్‌డ్యాంలు ఉండగా వాటిలో రెండు శిథిలమయ్యాయి. మానవపాడు మండలంలోని కలుకుంట్ల, మానవపాడు, కొరివిపాడు, జల్లాపూర్, పల్లెపాడు, చందూర్, చిన్నపోతులపాడు, గోకులపాడు, బొరవెల్లి, పెద్ద పోతులపాడు గ్రామ శివార్లలో మొత్తం 13 చెక్ డ్యాంలు నిర్మించారు. వాటిలో 2 చెక్‌డ్యాంలు శిథిలమయ్యాయి. ఇటిక్యాల మండలంలోని ఉదండాపురం – సాతర్ల గ్రామాల మధ్య ఒక చెక్ డ్యాం ఉండగా అది కూడా శిథిలమైంది. వడ్డేపల్లి మండలంలోని బుడమర్సులో 2 చెక్‌డ్యాంలు ఉన్నాయి. వాటికి కూడా మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

నత్తనడకన నిర్మాణ పనులు..

జిల్లాలో 4 నూతన చెక్‌డ్యాంలు నిర్మాణ దశలో ఉన్నాయి. వాటిలో నందిన్నె శివారులో రూ.1.77 కోట్లతో చేపట్టిన చెక్ డ్యాం పూర్తయ్యింది. గుంటిపల్లి శివారులో రూ.2.06 కోట్లు, దయ్యాలవాగు వద్ద రూ.1.96 కోట్లతో చేపట్టిన చెక్‌డ్యాంతో పాటు చందూరు శివారులో రూ.1.2 కోట్లతో చేపట్టిన చెక్‌డ్యామ్‌కు అనుమతులు రద్దయ్యాయి. అదే విధంగా గువ్వల దిన్నె శివారులో నూతన చెక్ డ్యాం నిర్మించేందుకు రూ.3.7 కోట్లు, ఇర్కిచేడు శివారులో రూ.3.85 కోట్లు, ఉప్పల శివారులో రూ.2.82 కోట్ల నిధులతో నూతన చెక్ డ్యాంలు నిర్మించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అనుమతులు లభించాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతులు రద్దు చేసింది.

నీరు నిల్వడం లేదు..

2009లో కురిసిన భారీ వర్షాలకు వాగులు పొంగిపొర్లాయి. దీంతో చెక్‌డ్యాంల సైడ్‌వాల్స్ తెగిపోయాయి. కట్టడాలు శిథిలమయ్యాయి. అప్పటి నుంచి వాటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో వాగుల్లో నీరు నిలువని పరిస్థితి ఏర్పడింది. కనీసం పశువుల దాహర్తీ తీర్చడం కూడా నీరు ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. శిథిలమైన చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేయించాలని ప్రజలు సంబంధిత అధికారులను విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేపట్టాలని, జిల్లాలో భూగర్భ జలాలు పెంచేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.

బోరుబావులు ఎండిపోయాయి



గతంలో చెక్‌డ్యాంలు తెగినప్పటి నుంచి వాగుల్లో నీరు నిలబటం లేదు. చుట్టు పక్కల ప్రాంతాల్లో భూగర్భజలాలు పడిపోయి బోరు బావులన్నీ ఒట్టిపోయాయి. చెక్‌డ్యాంలు పునర్ నిర్మిస్తేనే భూగర్భ జలాలు పెరుగుతాయి.

– దేవేందర్, సింధనూరు

మరమ్మతు చేపట్టడం లేదు



చెక్‌డ్యాంలు తెగిపోయి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు మరమ్మతులు చేయలేదు. కనీసం సైడ్ వాల్స్‌కు మరమ్మతులు చేయాలి. ఉన్నతాధికారులు స్పందించి చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేసి భూగర్భ జలాలు పెంచేందుకు కృషి చేయాలి.

– మేకల నాగిరెడ్డి, అయిజ మండల రైతు సంఘం అధ్యక్షుడు

ప్రతిపాదనలు పంపుతాం



తెగిపోయిన చెక్ డ్యాంల మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరు కాలేదు. జిల్లాలో చేపట్టిన నాలుగు చెక్ డ్యాంలకు గాను రెండు పూర్తయ్యాయి. తెగిపోయిన చెక్ డ్యాంల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతాం.

–శ్రీనివాస్, ఆర్డీఎస్ ఇన్‌చార్జ్ ఈఈ

న్యాయం చేసేందుకే వక్ఫ్ సవరణ చట్టం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఇటిక్యాల: నిరుపేద ముస్లింలకు న్యాయం చేసేందుకే వక్ఫ్ సవరణ చట్టమని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సాతర్ల గ్రామంలో పార్టీ మండలాధ్యక్షుడు షేక్ అబ్దుల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రభుత్వం పార్లమెంటులో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం లభించడంతో నిరుపేద ముస్లింల హక్కులకు పూర్తి భద్రత లభించినట్లయిందన్నారు. ప్రతి పౌరుడి గౌరవానికి ప్రాధాన్యం ఇవ్వడానికే బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కశ్మీర్ పహల్గామ్ ఘటనను ముక్త కంఠంతో ఖండించాన్నారు. ఐక్యంగా ఉండి ఉగ్రవాదాన్ని రూపుమాపాల సూచించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్ రెడ్డి, సంజీవరెడ్డి, గోపాలకృష్ణ, నాగరాజ్, నర్సింహులు, అచ్యుతారెడ్డి, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు

అలంపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి చేపడుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జీ రాజు పిలుపునిచ్చారు. అలంపూర్ పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ...ఉపాధి హామీ కూలీలకు పని రోజులు పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతు ఆత్మహత్యలను అరికట్టాలనే తదితర డిమాండ్లతో దేశ వ్యాప్తపు సార్వత్రిక సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. మే 20న సార్వత్రిక సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, మానవహారాలు వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మికులు, రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అదే విధంగా మే 1న జరిగే అంతర్జాతీయ కార్మికుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జయన్న, నరసింహ్మ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు అన్ని వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు కేటాయించిన స్థలంలో అన్ని వసతులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్, సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఉదండాపూర్ రిజర్వాయర్ కింద వల్లూరు, ఉదండాపూర్, తుమ్మలకుంట తండా, రేగడిపట్టి తండా, చిన్నగుట్టతండా, శామగడ్డ తండా, ఒంటిగుడిసె తండా, పోలేపల్లి వ్యవసాయ క్షేత్రంలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు, అవార్డు అందుకున్న వారందరికీ పునరావాసం కింద 300 గజాల స్థలం, వారి అవసరాలకు ప్రైమరీ హెల్త్ సెంటర్, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పశువైద్యశాల, కమ్యూనిటీ హాల్స్, పార్కులను, ఓవర్ హెడ్ ట్యాంక్ వంటి మౌలిక సదుపాయాలు త్వరితగతిన పూర్తయ్యేలా చేపట్టాలని ఆదేశించారు. మిషన్ భగీరథ వాటర్ పైపులైన్లు ఇచ్చిన గడువులోగా త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ మోహన్ రావు, స్పెషల్ కలెక్టర్ (ఎల్‌ఎ) మధుసూదన్ నాయక్, ఆర్డీఓ నవీన్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేటీదొడ్డి: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హనుమంతు అన్నారు. మంగళవారం మండలంలోని మైలగడ్డలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. వరి ధాన్యం క్వింటాకు రూ.2,320 మద్దతు ధరను ప్రభుత్వం అందిస్తామన్నారు. అదే విధంగా సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ అదనంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉరుకుందు, శేఖర్, కుశాల్, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో రిమాండ్‌కు తరలింపు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌కు చెందిన ఎస్.లక్ష్మీరెడ్డిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ మొగిలయ్య తెలిపారు. వడ్డేపల్లి మండలం తనగలకు చెందిన సంద్యపోగు రమేష్ ఫిబ్రవరి 12న హత్యకు గురయ్యాడు. కేసుకు సంబంధించి గతంలో ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. విచారణలో భాగంగా మరో నిందితుడైన లక్ష్మీరెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను నియమించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని టీపీఆర్టీయూ నాయకులు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డికి మంగళవారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు హర్షవర్ధన్ రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు భూపతిసింగ్, జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పౌరాణిక కళాకారులను ఆదుకోవాలి

చిన్నంబావి: రాష్ట్రంలోని పౌరాణిక రంగస్థల కళాకారులను ఆదుకోవాలని పౌరాణిక సంఘం జిల్లా అధ్యక్షుడు మహేష్ కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పౌరాణిక కళాకారుల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రంగస్థల కళాకారులకు ప్రభుత్వం అండగా ఉండాలని, ఆ కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. అర్హులైన కళాకారులకు ప్రభుత్వం పింఛన్, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండు చేశారు. మంత్రి జూపల్లి కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పద్మగౌడ్, వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, వెంకటయ్య, కృష్ణారెడ్డి, కాంతారెడ్డి, పూజారి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి



జింకలపల్లిలో ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు



మల్దకల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

మల్దకల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బీఎం. సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మల్దకల్ రైతు సంబరాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. కొనుగోలు చేసిన వెంటనే అధికారులు రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రైతుల బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేసే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, తాగునీరు, ప్యాడీ క్లీనర్‌ను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం వరికి కనీస మద్దతు ధర రూ.2320తో పాటు అదనంగా మరో రూ.500లు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి స్వామికుమార్, మండల వ్యవసాయాధికారి రాజశేఖర్, సింగిల్ విండో కార్యాలయ సీఈఓ కిరణ్‌కుమార్ రెడ్డి, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

ఎర్రవల్లి: రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. మంగళవారం ఎర్రవల్లి మండల పరిధిలోని కొండేరు, జింకలపల్లి గ్రామాల్లో ఐకేపీ కేంద్రాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈదురు గాలులు, వర్ష సూచన ఉన్నందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా రైతులు వడ్లలో తాలు, రాళ్లు, మట్టిపెల్లలు లేకుండా ధాన్యం తీసుకొచ్చి సిబ్బందికి సహకరించాని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం కుర్మయ్య, ఏఈఓ ప్రవళ్లిక, ఐకేపీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

గట్టు: గ్రామాల్లో ప్రతి నెల పౌరహక్కుల దినోత్సవాన్ని తప్పని సరిగా నిర్వహించాలని కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు మారెన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రెప్ప, సహాయ కార్యదర్శి ఆంజనేయులు మంగళవారం తహసీల్దార్ సలీముద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రెప్ప మాట్లాడుతూ.. గ్రామాల్లో అంటరానితనాన్ని నిషేధించి, దేవాలయాల్లో ప్రవేశం కల్పించాలన్నారు. తహసీల్దార్, ఎస్‌ఐ, డీఎస్పీ స్థాయి అధికారులు గ్రామాల్లో నిర్వహించే పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొనాలని కోరారు. ప్రస్తుతం పౌరహక్కుల దినోత్సవాన్ని గిర్దావర్, కానిస్టేబుళ్లతో గ్రామాల్లో నామ మాత్రంగానే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దళిత వాడల్లో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా వారి సమస్యలు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు నారాయణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలో కాంగ్రెస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేస్తామని పార్టీ పరిశీలకుడు దొమ్మాటి సాంబయ్య, డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ త్వరలోనే గ్రామ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పార్టీ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధిస్తామన్నారు. వరంగల్ సభలో మహిళలను తక్కువ చేసి మాట్లాడటం బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు తగదన్నారు. ఈ సభకు ప్రజలను సంతలో పశువుల వలే తరలించారని విమర్శించారు. అక్కడ కాంగ్రెస్‌ను దుమ్మెత్తి పోయడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల హయాంలో ప్రజలకు ఉపయోగపడే పనులేమీ చేయలేదని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే సుమారు 55 వేల ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. కులగణనతో పాటు ఎస్సీ వర్గీకరణ అమలుకు చట్టం తీసుకొచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైతులకు రూ.2 లక్షలలోపు రుణాల మాఫీతో పాటు పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. వీటన్నింటిని చూసి మాజీ సీఎం కేసీఆర్‌కు బాధ కలుగుతున్నట్లుందని ఎద్దేవా చేశారు.కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, పార్టీ మరో పరిశీలకుడు జి.భాస్కర్ యాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు వినోద్‌కుమార్, సంజీవ్ ముదిరాజ్, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కొత్వాల్, భాస్కర్‌యాదవ్

హనుమాన్ చాలీసాను నిరంతరం పఠించాలి

అడ్డాకుల: ప్రతి ఒక్కరు హనుమాన్ చాలీసాను నిరంతరం పఠించాలని వీహెచ్‌పీ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మళ్ల సత్యంజీ అన్నారు. మూసాపేట మండలం వేముల గ్రామంలో విశ్వహిందూ పరిషత్ పాలమూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన బాలబాలికల ఆధ్యాత్మిక వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులు మంగళవారం ముగిశాయి. చివరి రోజు కార్యక్రమానికి హాజరైన సత్యంజీ మాట్లాడుతూ హనుమంతుడిని ఆరాధిస్తే మనోధైర్యం, మానసిక శక్తి కలుగుతాయన్నారు. సనాతన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రాచీన కళల విజ్ఞానం, భగవద్గీత స్లోకాలు, భారతం, భాగవతం, రామాయణ నీతి కథలపై పిల్లలకు అవగాహన కల్పించాలని కోరారు. వివేకానందుడు, రామకృష్ణ పరమహంసతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహనీయుల చరిత్రను పిల్లలకు వివరించారు. హిందూ ధర్మ పరిరక్షణకు అందరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రాంత ఉపాధ్యక్షులు జగదీశ్వరయ్య, వీహెచ్‌పీ విభాగ్ ప్రముఖ్ రాచాల జనార్దన్, మాజీ జెడ్పీటీసీ బాలనర్సింహులు, నిర్వాహకులు కొండారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, తిరుపతయ్య, అనంతరెడ్డి, తుంగన్న, మాధవరెడ్డి, అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వేములలో మాట్లాడుతున్న సత్యంజీ

అదుపు తప్పితే అంతే..

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వపై నిర్మించిన వంతెన పిట్టగోడలు దెబ్బతింటున్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోంటాయో అన్న భయంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వంతెన దాటేస్తున్నారు. మండలంలోని అమరచింత నుంచి మూలమళ్లకు వెళ్తున్న కచ్చారహదారిపై ఎడమ కాల్వ దాటేందుకు ఇరు గ్రామాల ప్రజల రాకపోకల కోసం వంతెన నిర్మించారు. ప్రస్తుతం వంతెన పిట్టగోడలు దెబ్బతినడంతో అవి విరిగి పడుతున్నాయి. వంతెనపై ద్విచక్రవాహనాలతో పాటు ఇతర వాహనాలపై వెళ్తున్న ప్రజలు వీటిని గమనించకుండా వెళితే కాల్వలో వారి వాహనాలు పడిపోవడం ఖాయమంటున్నారు. ఇప్పటికైనా పీజేపీ అధికారులు స్పందించి వంతెనల మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.



మూలమళ్ల-అమరచింత రహదారిలో కాల్వపై ఉన్న వంతెన దుస్థితి

దొడ్ల పంచాయితీలో ఘర్షణ

గద్వాల క్రైం: గద్వాల మండల పరిధిలోని కొండపల్లి గ్రామంలో దొడ్ల పంచాయితీ విషయంలో జరిగిన ఘర్షణలో ఒకరు తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం జరిగింది. దొడ్ల పంచాయితీలో ఎల్లప్ప, నారయణ కుటుంబ సభ్యుల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో వారి కుటుంబ సభ్యులైన నాగన్న, నర్సింహులు వడ్ల నారాయణపై దాడి చేశారు. దాడిపై బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.